మేడిగడ్డకు తరలిన నాయకులు



మల్కాజిగిరి చౌరస్తా నుంచి ర్యాలీగా తరలిన నాయకులు

మల్కాజిగిరి: బీఆర్‌ఎస్ చేపట్టిన ఛలో మేడిగడ్డకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మల్కాజిగిరి చౌరస్తా నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే కాళేశ్వరం వంటి ప్రాజెక్ట్ నిర్మాణం జరగలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతుల కష్టాలు తీర్చడానికి కేసీఆర్ అపర భగీరథుడిలా ప్రాజెక్ట్‌ల నిర్మాణం చేపట్టి పూర్తి చేశారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకనే ఆరోపణలు చేస్తోందన్నారు. ర్యాలీగా తరలివెళ్లిన వారిలో కార్పొరేటర్ మురుగేష్, నాయకులు జగదీష్‌గౌడ్, వెంకన్న తదితరులు ఉన్నారు.

చెంగిచర్లలో మల్లన్న జాతరకు ఏర్పాట్లు



బోడుప్పల్: చెంగిచర్లలోని శ్రీకేతకి భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి జాతరను ఈ నెల 3వ తేదీ నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు బింగి జంగయ్యయాదవ్ వెల్లడించారు. చెంగిచర్లలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన ఉదయం 10 గంటలకు పుట్ట బంగారం తెచ్చుట, సాయంత్రం 6 గంటలకు గంగ స్నానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 4వ తేదీన భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ జమదగ్ని మునిరాజు తల్లి కల్యాణం, అనంతరం బోనాలు సమర్పించుట, సాయంత్రం గొలుసు తెంపుడు, అగ్ని గుండాలు తొక్కుట, 5వ తేదీన కొండ పోచమ్మ తల్లి గుడిలో పెద్ద పట్నం వేయడం, 8వ తేదీన మహా శివ రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మాదిగ అమరవీరుల స్మారక దినోత్సవం



కుషాయిగూడ: హెచ్‌బీకాలనీలో మాదిగ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరులను స్మరించుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, కళామండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.పరమేష్, జంగ బాలరాజు, నర్సింగరావు, లాజర్, మహేందర్, జోసఫ్, నర్సింగరావు, లక్ష్మణ్, జములయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

ఘనంగా రాక్‌వుడ్స్ పాఠశాల వార్షికోత్సవం



అల్వాల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి ప్రతిభాపాటవాలను చాటాలని రాక్‌వుడ్స్ పాఠశాల చైర్మన్ రామానాయుడు అన్నారు. అల్వాల్‌లోని రాక్‌వుడ్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల చైర్మన్ రామానాయుడు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు దేశభక్తి, అంకితభావం అలవర్చుకునేలా రాక్‌వుడ్స్ పాఠశాలలో బోధన ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల సీఈవో సుబ్రహ్మణ్యం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టాల పంపిణీ



మల్లాపూర్: నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కె.నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. చీఫ్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ పవన్ కె.సాంబ, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుమమీనన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా వీరస్వామి



కుషాయిగూడ: కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్ జి.వీరస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ మహేష్ జోన్-2కు బదిలీపై వెళ్లగా ఎల్‌బీనగర్ డీఐగా విధులు నిర్వహించిన వీరస్వామిని కుషాయిగూడకు బదిలీ చేస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం విధుల్లో చేరారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానన్నారు.

శ్రీనివాస్‌రెడ్డిపై జవహర్‌నగర్ పీఎస్‌లో కేసు

జవహర్‌నగర్: సర్కారు భూమిలో అక్రమార్కులు బోరు వేసి, షెడ్డు ఏర్పాటు చేసి కబ్జాకు పాల్పడ్డారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గతంలో పనిచేసిన తహసీల్దార్ మథిన్ ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాప్రా జమ్మిగడ్డ ప్రాంతంలోని సర్వే నెం.199 బై 1 స్థలాన్ని స్టేడియానికి కేటాయించారు. ఆ స్థలంలో సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దర్జాగా బోరు వేసి, షెడ్డు వేయగా అప్పటి తహసీల్దార్ ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదని, ఈ విషయంపై శుక్రవారం సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది.

అందరి గురి.. మల్కాజ్‌గిరి

- ఎంపీ స్థానంపై అభ్యర్థుల మధ్య బలమైన పోటీ
- పార్టీల టికెట్ కోసం సీనియర్లు, ధనవంతులు యత్నం
- గతంలో రాజకీయం చేయని నేతలు సైతం రేసులో..



మేడ్చల్: దేశంలో అతిపెద్ద నియోజకవర్గమైన మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ దక్కించుకునేందుకు అన్ని పార్టీల నేతలు అమితాసక్తి చూపుతున్నారు. మేడ్చల్, కంటోన్మెంట్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలతో కలిపి మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంగా ఉంది. సగం హైదరాబాద్ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. దీంతో 30 లక్షలకు పైగా ఓటర్లు గల ఈ నియోజకవర్గంపై అన్ని ప్రాంతాల నేతలు కన్నేశారు. రేపో.. మాపో టికెట్ల ఖరారు చేయనుండటంతో నాయకులు మధ్య పోటీతత్వం పెరిగింది.

పార్టీల నుంచి భారీగా..

రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలలో మల్కాజ్‌గిరి టికెట్ కోసం పోటీ గట్టిగానే ఉంది. బీఆర్‌ఎస్ నుంచి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు రేసులో ఉండగా.. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ప్రముఖ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి, మధుయాష్కి గౌడ్ తదితరులు రేసులో కనిపిస్తున్నారు. మరోవైపు బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, శ్రీశైలం గౌడ్, సీనియర్ నాయకుడు మురళీధర్‌రావు, మాజీ ఎంపీ సురేశ్‌రెడ్డి, విద్యావేత్త మల్క కొమురయ్య, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ తదితరులు పోటీలు ఉన్నారు.

జోరుగా ప్రచారం..

మల్కాజ్‌గిరి టికెట్ ఆశిస్తున్న నేతల్లో చాలామంది నియోజకవర్గ రాజకీయాలకు పరిచయం లేని వ్యక్తులే అధికం. ఈక్రమంలో బీజేపీ టికెట్ ఆశిస్తున్న కొమురయ్య నగరం మొత్తం తన పోస్టర్లు, హోర్డింగ్‌లు, వాల్ రైటింగ్‌లతో నింపేశారు. మరో నేత రామకృష్ణ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా.. మురళీధర్‌రావు ఒకవైపు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ మరోవైపు హోర్డింగ్‌లు, పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లు జోరుగా ఏర్పాటు చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అల్లుఅర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి రహదారుల వెంబడి, పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ప్రత్యక్ష రాజకీయాల్లో కనిపించని భద్రారెడ్డి పేరుతో కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పడ్డాయి. ఇలా టికెట్ ఆశిస్తున్న నేతలు ఎవరికి వారు జోరుగా ప్రచారం చేసుకోవడం విశేషం.

పట్టణ ఓటర్లు అధికం..

మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం విభిన్నమైంది. 95 శాతం పట్టణ ఓటర్లున్న ప్రాంతం ఇది. నియోజకవర్గంలో స్థానికుల కంటే సెటిలర్ ఓటర్లే అధికం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ఉత్తర భారతం నుంచి వచ్చిన వారే ఎక్కువ ఓటర్లుగా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం.. కేంద్రంలో మోదీ షరిష్మా పని చేస్తుండటంతో ఈ రెండు పార్టీలకు చెందిన రాజకీయ నిరుద్యోగులు టికెట్ రేసులోకి వచ్చారు. కాంగ్రెస్, బీజేపీ సింబల్‌పై పోటీ చేస్తే ఈజీగా విజయం సాధించవచ్చన్న ఆశతో ధనవంతులైన నేతలు రాజకీయ రంగంలోకి దిగుతున్నారు.

బీజేపీలో పోటీ ఎక్కువ..

మల్కాజ్‌గిరి బీజేపీ టికెట్ అందరి మధ్య పోటీ పెట్టింది. పార్టీ బీ ఫారం ఆశిస్తున్న ఈటల రాజేందర్, మురళీధర్‌రావు, కొమురయ్య మధ్య తీవ్ర పోటీ కనిపిస్తోంది. మురళీధర్‌రావు జాతీయ నేత కావడం.. ఈటల రాష్ట్ర కీలక నేత కావడంతో వారు నేరుగా ఢిల్లీ పెద్దలతో టికెట్ రాజకీయం నడిపిస్తున్నారు. కొమురయ్య ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు ఉన్న వ్యక్తి కావడంతో ఆయన రూటు మరోలా ఉంది. ముగ్గురు నేతలు నియోజకవర్గంలో జోరుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుండటం విశేషం.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో ఎవరో..

మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ కోసమే అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరారనేది బహిరంగ రహస్యమే. ఆయన మేడ్చల్ జిల్లాకు పరిచయం లేని వ్యక్తి.. టికెట్ ఆశిస్తున్నానని చెప్పకనే తన ప్రచారం మాత్రం జోరుగా సాగిస్తున్నారు. టికెట్ ఆశించే నాయకుల సంఖ్య పార్టీలో ఎక్కువగా ఉన్నా చంద్రశేఖర్‌రెడ్డి పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు బీఆర్‌ఎస్ టికెట్ దాదాపుగా మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డికి కన్ఫామ్ అయిందని పార్టీ వర్గాల సమాచారం. మొత్తం మీద మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం అన్ని పార్టీలో నాయకుల మధ్య పోటీ పెంచింది.

పీర్జాదిగూడ బడ్జెట్‌కు ఆమోదం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.57.73 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోద ముద్ర వేసింది. నగర మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకమండలి సమావేశంలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రారంభ నిలువ రూ.40.29 లక్షలు కాగా మున్సిపల్ కార్పొరేషన్ సొంత రాబడి రూ.43.57 కోట్లుగా, డిపాజిట్లు, లోన్ల ద్వారా రూ.3.05 కోట్లుగా, అంచనా గ్రాంట్ల రూపంలో రూ.10.70 కోట్ల ఆదాయం చేరుతుందని అంచనా వేశారు. పనుల ద్వారా రూ.20.10 కోట్లు ప్రత్యక్ష రాబడిగా పన్నేతర ఆదాయంగా రూ.26.52 కోట్లుగా అంచనా వేశారు. నాన్‌ప్లాన్ గ్రాంట్ల రూపంలో రూ.6.95 కోట్లు, ప్లాన్ గ్రాంట్ల కింద రూ.15 లక్షలు, ఇతర గ్రాంట్ల ద్వారా రూ.3.60 కోట్ల రాబడి వస్తోందని అంచనాతో మొత్తం రూ.57.73.09 కోట్లు సమకూరుతాయని అంచనాలను రూపొందించగా పాల్గొన్న సభ్యులు ప్రతిపాదిక అంచనా బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ప్రతిపాదిక బడ్జెట్‌లో రూ.72.48 లక్షలు ముగింపు నిలువగా బడ్జెట్ పద్దులు రూపొందించారు. కాగా వచ్చిన ఆదాయంలో ఉద్యోగులు, సిబ్బంది జీతాలు, వేతన భత్యాలకు రూ.9.17 కోట్లు పారిశుద్ధ్య పరికరాల కొనుగోలు, ఖర్చులకు రూ.3.89 కోట్లు, సీసీచార్జీలకు రూ.1.83 కోట్లు, గ్రీన్ బడ్జెట్(హరితహారం) రూ.4.47 కోట్లు, ఇతర పనుల నిర్వాహణకు రూ.4.43 కోట్లు, ప్రజాసౌకర్యాల నిర్వహణకు రూ.2.85కోట్లు, డివిజన్ల వారి పనుల నిర్వహణకు రూ.9.60 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. కాగా గత ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన అంచనా బడ్జెట్ భారీగా రూ.235.89 కోట్లు ఉండగా ఈ సంవత్సరం కేవలం రూ.57.73 కోట్లుగా రూపొందించడంపై పలువురు పెదవి విరుస్తున్నారు. గతంలో ఇతర గ్రాంట్ల రూపంలో రూ.184 కోట్ల వరకు పెద్ద మొత్తంలో ఆదాయం చేకూరగా.. ఈసారి కేవలం రూ.3.60 కోట్లుగా ఉండటం గమనార్హం.

సమావేశానికి మెజార్టీ కార్పొరేటర్ల గైర్హాజరు

మేయర్ అధ్యక్షతన ఏర్పాటైన బడ్జెట్, సాధారణ సర్వసభ్య సమావేశాలకు మెజార్టీ కార్పొరేటర్లు గైర్హాజరు కావడం గమనార్హం. 26మంది కార్పొరేటర్లకు కేవలం 10మంది మాత్రమే సమావేశంలో పాల్గొనడం విచిత్రంగా తోచింది. వార్షిక బడ్జెట్ సమావేశంలో మెజార్టీ సభ్యులు పాల్గొనకపోవడం మేయర్, కార్పొరేటర్ల మధ్య సఖ్యత లోపించిందనే సంకేతాలు స్పష్టం అవుతున్నాయి. కొన్ని నెలలుగా పలువురు సభ్యులు మేయర్‌పై అవిశ్వాశ తీర్మానం ప్రవేశపెట్టాలని అధికార పార్టీతో జతకట్టి వేరు కుంపటి పెట్టి ఇరువర్గాలు పలు దఫాలుగా విహారయాత్రలకు పోవడం, ఆ క్రమంలోనే కార్పొరేటర్లు గైర్హాజరు అయ్యారనే విషయం స్పష్టం అవుతోంది.



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

ఆదర్శ నగరంగా పీర్జాదిగూడ కార్పొరేషన్



మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు. పీర్జాదిగూడ మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రతిపాదించిన 23 అంశాలతో కూడిన తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి అవిశ్రాంతంగా కృషిచేస్తూ మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అవసరమైన తాగునీరు, సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. ప్రజలకు సదుపాయాల కల్పనలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. మున్సిపాలిటీని 100శాతం చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ఐటీసీ వంటి స్వచ్ఛంద సంస్థలతో నగరంలో ఉత్పత్తి అయ్యే పొడిచెత్త నిర్వాహణకు ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు వివరించారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు, మేనేజర్ జ్యోతి ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ సమస్యలను పరిష్కరించుకోండి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన




బోడుప్పల్: 18వ డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. డివిజన్ పరిధిలో ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. శుక్రవారం ఆమె ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కుషాయిగూడ చాకలిబస్తీలో వేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణం నాణ్యతను పరిశీలించిన ఆమె సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. డివిజన్ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి డివిజన్‌ను అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు. కార్యక్రమంలో ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, స్థానికనేతలు పాల్గొన్నారు.

శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గీతాజ్ఞాన యజ్ఞం



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం శ్రీమత్ గీతాజ్ఞాన యజ్ఞం, శ్రీమత్ భాగవత కథ సప్తాహంలో భాగంగా రుద్రాభిషేకం, జ్ఞానయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో భగవద్గీత భక్త సమాజం, అల్వాల్ బ్రాహ్మణ సంఘం, వైశ్య సంఘం, సీనియర్ సిటిజన్ అసోసియేషన్, రామాంజనేయ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం

– కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



చిలుకానగర్ చౌరస్తాలో స్వీట్లు పంచుతున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

ఉప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి వారికి వరమని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాల వారికి వరంగా మారుతున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలు సందర్భంగా శుక్రవారం చిలుకానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. పరమేశ్వర్‌రెడ్డి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని, అందులో ఎంటువంటి అనుమానం అక్కర్లేదన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఒక్కో పథకాన్ని అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, బజారు జగన్నాథ్‌గౌడ్, బొట్టు రాజేష్, బూర్గుల రమేష్, ఆగంరెడ్డి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవాలయంలో సామూహిక కుంకుమార్చన



బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ ఆలయంలో సప్తాహ్నిక పంచ కుండాత్మక పుష్కర బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు సేవాల కాలం, తీర్థగోష్టి, 8 గంటలకు ద్వారతోరణ పూజ, చతుస్థానార్చన, అగ్ని ముఖం, అష్టాక్షరి హవనం, నిత్య పూర్ణాహుతి, నిత్యబలి కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. అలాగే ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, సాయంత్రం 6గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీపుష్ప యాగానికి శ్రీత్రిదండి చిన్న జీయర్ స్వామి హాజరై వారి చేతులమీదగా మహాకుంభ సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గృహజ్యోతితో పేదల జీవితాల్లో వెలుగులు



చర్లపల్లిలో గృహజ్యోతిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



వెంకటాపురంలో జీరో బిల్స్ అందజేస్తున్న విద్యుత్ విభాగం అధికారులు

కుషాయిగూడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా శుక్రవారం చర్లపల్లి డివిజన్‌లో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ కో సిబ్బందితో కలిసి జీరో బిల్లును అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు దశలవారీగా అమలు చేస్తూ పేదలకు చేరువ చేస్తున్న తీరు ముఖ్యమంత్రి పాలనపై ప్రజలకు విశ్వాసం కలిగిస్తుందన్నారు. అలాగే 500లకే గ్యాస్ సిలిండర్ పథకం కూడా అమలులోకి రావడం పేదలకు మరింత ఊరట ఇచ్చిందన్నారు. అలాగే మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో కూడా శుక్రవారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ సుభాష్, ఏడీఈ ముత్తయ్య, ఏఈ రామకృష్ణతో పాటు స్థానిక నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, అంజిరెడ్డి, గడ్డం యాదగిరి, గోపాల్ యాదవ్, నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు జీరో కరెంటు బిల్స్ అందజేత

అల్వాల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 200 యూనిట్ల గృహజ్యోతి పథకం కింద లబ్ధిదారులకు శుక్రవారం వెంకటాపురం శివనగర్ కాలనీలో విద్యుత్ విభాగం అధికారులు జీరో బిల్స్ అందచేశారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ సుచింద్రనాథ్, ఏడీఈ సీహెచ్.శ్రీరామచారి, ఏఈ జగదీష్‌సాయి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీరో కరెంటు బిల్లులు షురూ

మల్కాజిగిరి: గృహజ్యోతి పథకంలో భాగంగా ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో జీరో బిల్లుల పంపిణీ శుక్రవారం ప్రారంభించామని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపికైన అర్హులందరికీ జీరో బిల్లులు జారీ చేస్తామన్నారు. ఇప్పటికీ దరఖాస్తు చేయని వారు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రజాపాలన పోర్టల్‌లో రిజిష్టర్ చేసుకొని సంబంధిత రసీదును కార్యాలయంలో అందజేస్తే పరిశీలించి వారికి కూడా జీరో బిల్లు పంపిణీ చేస్తామన్నారు.

నకిలీ ఐస్‌క్రీం సంస్థపై ఎస్‌వోటీ పోలీసుల దాడి



ఉప్పల్: గడువు తీరిన కెమికల్స్ వాడుతూ నకిలీ ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్న కేంద్రంపై మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు దాడి చేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ చర్చి కాలనిజర్సీ సమీపంలోని పారిశ్రామికవాడలో క్రీమ్ లైన్స్ బెర్రీస్ ఐస్‌క్రీమ్ పరిశ్రమను అదే కాలనీకి చెందిన భానుమూర్తి నిర్వహిస్తున్నారు. నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్స్, గడువు తీరిన కెమికల్స్ వాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం స్థావరంపై దాడి చేసి ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిర్వాహకుడు గోన శ్రీనివాసరావు(52)ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. యాజమాని భానుమూర్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.35 వేల లంచం తీసుకుంటూ..

ఏసీబీకి చిక్కిన జేఏవో విజయసింహారెడ్డి



ఉప్పల్: పెండింగ్‌లో ఉన్న ఆర్టిజన్ జీతం మంజూరు చేసేందుకు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ అధికారి అడ్డంగా దొరికాడు. ఈ ఘటన హబ్సిగూడ డీఈ కార్యాలయంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించారు. హబ్సిగూడ డివిజన్ డీఈ కార్యాలయంలో జూనియర్ అకౌంట్ ఆఫీసర్‌గా పనిచేసే సామ విజయసింహారెడ్డి నాచారం ఏడీఈ కార్యాలయంలో ఆర్టిజన్‌గా పనిచేసే ఎం.భరత్‌కు సంబంధించిన ఏరియర్ 14 నెలల జీతం బిల్ పెండింగ్‌లో ఉంది. కేవైసీ సమస్య ఉందని, అందుకే నిలిపివేశారని దాన్ని క్లియర్ చేసేందుకు రూ.35 వేలు డిమాండ్ చేశాడు. భరత్ ఎంత వేడుకున్నా కనికరించలేదు. దీంతో లంచం ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. ఇదే విషయాన్ని ఏసీబీ అధికారులకు చేరవేశాడు. దీంతో రంగంలోకి దిగిన హైదరాబాద్ సిటీ రేంజ్-2 అధికారులు భరత్‌ను గైడ్ చేస్తూ వచ్చారు. అనుకున్న ప్రకారం శుక్రవారం డబ్బులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మధ్యాహ్నం రూ.35 వేలను జయసింహారెడ్డికి అందజేయగానే తాను కూర్చున్న టేబుల్ డ్రాలో పెట్టుకున్నాడు. ఈలోపు అక్కడే మాటువేసిన అధికారులు వెంటనే డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. అతడి చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రిజల్ట్ రావడంతో అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.35 వేలను రికవరీ చేసి నాంపల్లి కోర్టుకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

నేడు 4కే రన్

కుషాయిగూడ: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాచకొండ సీపీ తరుణ్‌జోషి ఆదేశాల మేరకు శనివారం 4కే రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ జి.వీరస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రన్ ఉదయం 6 గంటలకు ఈసీఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమై కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ మీదుగా ఎన్‌ఎఫ్‌సీనగర్ వరకు కొనసాగుతుందన్నారు. ఉత్సాహంగా ఉన్న మహిళలు, యువతీ యువకులు ఈ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.